# వసంతం

శంకర్‌రావు శంకేసి



ఆఫీసు నుండి ఇంటికొచ్చిన వినయ్‌కి పోస్టుమాన్ విసిరేసి వెళ్ళిన కవరొకటి కన్పించింది. అప్రయత్నంగా కవర్‌ను చేతిలోకి తీసుకొని ఫ్రమ్ అడ్రస్‌వైపు చూసాడు. అంతే వినయ్‌లో ఒక్కసారిగా జ్ఞాపకాల తరంగాలు ఎగసిపడ్డాయి. వైజాగ్ నుంచి నీరజ రాసిన ఉత్తరం అది. నీరజ తనకెందుకు ఉత్తరం రాసింది? అసలా ఉత్తరంలో ఏం రాసి ఉంటుంది? ఉత్తరం విప్పకముందే అతనిలో సందేహాల పరంపర మొదలైంది. గుండె వేగం హెచ్చుతుండగా, చేతివేళ్ళు తెలియని భయంతో వణుకుతుండగా వినయ్ ఉత్తరం తెరిచాడు. అక్షరాలు ముత్యాల్లా లేవు. మనసు గాయాల్ని మోస్తున్న మౌనబిందువుల్లా ఉన్నాయి. అక్షరాల వెంట వినయ్ కళ్ళు పరిగెత్తాయి.

*ప్రియమైన వినయ్ బావకి, నీరజ రాస్తున్న లేఖ!*

*ఎలావున్నావ్. ఐదేళ్ళక్రితం నీవిక్కడ్నుంచి వెళ్ళిన తర్వాత నీ నుండి మాకు ఎలాంటి సమాచారమూ లేదు. నా మూలా నా నీవు మా కుటుంబంతో తెగదెంపులు చేసుకున్నా మమ్మల్ని మరీ ఇంతగా మరచిపోవడం భావ్యం కాదు. నీ వెళ్ళిన తర్వాత నాన్నగారు నీ మీదే బెంగపెట్టుకుని ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేశారు. ప్రస్తుతం పర్వాలేదు. ముఖ్యవిషయం నేను వచ్చే సోమవారం గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాదు వస్తున్నాను. నిన్ను తప్పకుండా కలుస్తాను.*

*ఇట్లు*
*-నీరజ*

ఉత్తరం పూర్తవ్వగానే మిన్ను విరగి మీదపడ్డట్లు ఉలిక్కిపడ్డాడు వినయ్. తనను అవమానించి, హేళన చేసి తను వాళ్ళింట్లోంచి వెళ్ళిపోవడానికి కారణమైన నీరజ ఐదేళ్ళ తర్వాత ఇప్పుడు తన దగ్గరికి ఎందుకు వస్తున్నట్లు? వారి నీడలేక, వారి అండలేక తనెలా బతుకుతున్నానో చూసి మళ్ళీ అవమానించడానికా? తనింకా ఒంటరిగానే జీవిస్తుండటాన్ని మళ్ళీ హేళన చేయడానికా? వినయ్ మనసులో సుడిగుండాలు తిరుగుతున్నాయి. అయినా నీరజ రాకలోని ఆంతరార్థం అంతుబట్టడం లేదు. హోటల్‌కెళితే భోజనం సహించలేదు. కళ్ళు మూసుకుంటే నిద్ర రావటం లేదు. తన గతం తాలూకూ జ్ఞాపకాల దొంతరలు మాత్రం ఒక్కొక్కటి విడివడుతున్నాయి.

నీరజ వినయ్ మేనమామ కూతురు. వినయ్ చిన్నప్పుడే తన తల్లిదండ్రులను కోల్పోవడంతో నీరజ నాన్నగారైన కృష్ణారావు వినయ్‌ని చేరదీసి తన వద్దే పెంచాడు. వినయ్ కంటే ఏడాది చిన్నదైన నీరజ చిన్నతనం నుంచి గారాబంగా పెరిగింది. నీరజ ఐదేళ్ళ వయస్సులో తల్లిని కోల్పోవడంతో కృష్ణారావు అన్నీ తానే అయి నీరజను పెంచాడు. నీరజంటే మొదట్నుంచి వినయ్‌కి ఎంతో ఇష్టం. పెరుగుతున్న కొద్దీ ఆమె పట్ల మరింత ఆరాధనభావం అతనిలో చోటుచేసుకుంది. కాని వినయ్ తనను ఆరాధిస్తున్నట్లు ఏనాడూ గమనించలేదు నీరజ. ఆమెతో జీవితాన్ని పంచుకోవాలని వినయ్ కలలుగన్నా తన ఆశల్ని మాత్రం బయటకి కన్పించనివ్వలేదు. నీరజను వినయ్‌కిచ్చి మూడుముళ్ళు వేయిస్తే తన బాధ్యత తీరిపోతుందని కృష్ణారావు ఇతరులతో అన్న సందర్భాలు వినయ్‌కి నీరజపై మరిన్ని ఆశలు కల్పించింది. అయితే ఉన్నట్టుండి ఓరోజు కృష్ణారావు నీరజను, వినయ్‌లను పిలిపించి వారిద్దరి పెళ్ళి విషయాన్ని చెప్పడంతో నీరజ తను అవమానానికి గురైనట్లు ఫీలయింది. పైసా ఆస్తిలేని వాడిని, అనాధను పెళ్లి చేసుకోవాల్సిన గతి తనకేమీ పట్టలేదని నీరజ నిర్మొహమాటంగా అనేసింది. ఇదివరకే తన మనసు మరొకరికి ఇచ్చానని, వినయ్‌తో తను జీవి

తం పంచుకోవడం సాధ్యపడదని అంటూ నీరజ క్షణమాత్రమైనా వుండకుండా వెళ్ళి పోయింది. నీరజ మాటలు కృష్ణారావును అవాక్కయ్యేలా చేయగా, వినయ్ మనసును ముక్కలు చేసాయి. చిన్నప్పటినుండీ మనస్ఫూర్తిగా ఇష్టపడ్డ తనను అనాధని అవమానిస్తుందా? వినయ్‌కి ఇక ఆ ఇంట్లో క్షణ మాత్రమైనా వుండాలనిపించలేదు. గభగభా వెళ్ళి సూట్‌కేసులో బట్టలు, సర్టిఫికెట్లు సర్దుకొని కృష్ణారావు ఎంత వారించినా వినకుండా హైదరాబాదు వచ్చేసాడు.

'తనక్కడినుండి వచ్చి అప్పుడే ఐదేళ్లయిందా!' గడియారం గంటలు కొట్టడంతో జ్ఞాపకాల ప్రవాహం నుంచి తేరుకొని అప్రయత్నంగా అనుకున్నాడు వినయ్. అనాలోచితంగా గడియారం వైపు చూసాడు. అర్ధరాత్రికి అర్ధగంట తక్కువ. "ఏం చేయాలిప్పుడు? తెల్లవారితే ఆదివారం. అంటే మరుసటిరోజే నీరజ తన వద్దకు వస్తుంది. అసలు తన అడ్రసు నీరజకెలా తెలిసింది? నో! తను మళ్ళీ నీరజ చేతిలో అవమానానికి గురికాకూడదు. ఇప్పుడు తన ముందున్నవి రెండే రెండు మార్గాలు. నీరజకు కలవకుండా అడ్రస్ మార్చేయడం, లేదా తను పెళ్ళి చేసుకొని సుఖంగా జీవిస్తున్నట్లు నీరజను నమ్మించడం'- ఏదీ నిర్ణయించుకోలేక బెడ్‌పై అటూఇటూ దొర్లుతున్నాడు వినయ్. తన అడ్రస్ నీరజకు తెలిసిన తర్వాత కూడా తను అడ్రస్ మార్చేస్తే తననో పిరికిపంద కింద జమకట్టి మళ్ళీ నవ్వుకోదూ? లేదు, తనిక్కడే వుండాలి. తను పెళ్ళి చేసుకొని జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నట్లు నీరజను భ్రమింపజేయాలి. 'షి ఈజ్ మై స్వీట్ వైఫ్' అంటూ గర్వంగా తన భార్యను నీరజకు పరిచయం చేయాలి. తనను చూసి నీరజ ఈర్ష్యపడాలి. 'అయ్యో తను బావను మిస్సయ్యానే' అని పశ్చాత్తాప పడాలి. తను తన భార్యతో చేసే సరస సంభాషణలు విని నీరజ కుళ్ళి కుళ్ళి ఏడ్వాలి. తనను ఛీ కొట్టినందుకు, అవమానించినందుకు, తనను కాదన్నందుకు నీరజ తగిన శిక్ష అనుభవించాలి. ఐదేళ్ళుగా తనెంత మానసికక్షోభ అనుభవించాడో అంతకు రెండింతలు క్షోభ అనుభవించేట్లు చేయాలి. అవును, తనకిప్పుడు ఓ అమ్మాయి కావాలి. నీరజ ఇక్కడ ఉన్నన్ని రోజులు ఆమె తనతో భార్యగా నటించాలి. ఆలోచిస్తూ, ఆలోచిస్తూ, వినయ్ మెల్లగా నిద్రలోకి జారుకున్నాడు.

**వినయ్ మనసులో సుడిగుండాలు తిరుగుతున్నాయి. అయినా నీరజ రాకలోని అంతరార్థం అంతుబట్టడం లేదు. హోటల్ కెళితే భోజనం సహించలేదు.**



***     ***     ***

రాత్రి ఎప్పుడు నిద్రపోయాడో గుర్తులేకున్నా ఉదయం 8 గంటలలోపే అన్ని కార్యక్రమాలు ముగించుకొని బయటపడ్డాడు వినయ్. ఆఫీసుకెళ్ళి తనకు అర్జెంటుగా వారం సెలవు కావాలని చెప్పి ఇంటికి తిరిగి రాగానే ఊరి నుండి తిరిగొచ్చిన తన రూమ్‌మేట్ కిరణ్ కన్పించాడు. వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లయింది వినయ్‌కి. విషయమంతా చెప్పాడు. ఇలాంటి విషయాల్లో కాంట్రాక్టుపై అమ్మాయిలను కుదిర్చే వ్యక్తి ఒకరు తనకు తెలుసునని కిరణ్ చెప్పడంతో ఇద్దరూ కలసి అక్కడికి వెళ్ళారు. అక్కడి వ్యక్తి వినయ్‌కి నలుగురైదుగురు అమ్మాయిల ఫోటోలను చూపించాడు. అందులో సునీత అనే అమ్మాయిని సెలెక్టు చేసుకొన్నాడు వినయ్. తన 'భార్య' విషయం నీరజకు తెలీకుండా తను తగు జాగ్రత్త వహించాలి. ఆఘమేఘాల మీద బజారుకెళ్ళి కాపురానికి కావలసిన కనీస వస్తువులను కొనుక్కొచ్చాడు. ఈ వారం రోజులూ కిరణ్‌ను వేరేచోట వుండమని చెప్పాడు. సాయంత్రం వెళ్ళి సునీతను తీసుకొచ్చాడు. చుట్టుపక్కలున్న వారిలో ఒకరిద్దరు అమ్మాయెవరని ప్రశ్నిస్తే ఆమె తన మావయ్య కూతురని, సిటీలో ఎగ్జామ్స్ రాయడానికొచ్చిందని చెప్పాడు. తన గతం గురించి, ఇప్పుడు తనున్న పరిస్థితుల గురించి సునీతకు పూర్తిగా వివరించి, నీరజ వచ్చిన తర్వాత ఎలా మసలుకోవాలో కూడా పూసగుచ్చినట్లు చెప్పాడు వినయ్. సునీత వినయ్ మాటల్ని మౌనంగా వింది. సునీతను చూసినప్పటి నుండి ఆమె 'అలాంటి' అమ్మాయంటే వినయ్‌కి నమ్మబుద్ధి కావడం లేదు. 'విధి ఎంత కఠినమైంది. అమాయకత్వం నిండి వున్న మల్లెమొగ్గలాంటి ఈ అమ్మాయిని ఈ కూపంలోకి నెట్టడానికి దానికి మనసెలా వచ్చింది?'- వినయ్ అంతరంగం మౌనంగా ఘోషించింది. సునీతకు గుడ్‌నైట్ చెప్పి మరోరూమ్‌లో నిద్రకుపక్రమించాడు వినయ్.

***     ***

మరికొద్ది నిమిషాల్లో గోదావరి ఎక్స్‌ప్రెస్ వస్తుందన్న అనౌన్సర్ మాటలు విన్పించగానే వినయ్ తేరుకొని వెయింటింగ్ హాల్ నుంచి బయటకు వచ్చాడు. ఐదేళ్ళ తర్వాత తను మళ్ళీ నీరజను చూడబోతున్నాడు. నీరజ ఇప్పుడెలా వుండివుంటుంది? అసలు తనను గుర్తుపడుతుందా? తను ప్రేమించిన వ్యక్తితో పెళ్ళి చేసుకుందా? చేసుకుంటే తన భర్తతో పాటు కలసివస్తోందా? ట్రెయిన్ ఆగిన శబ్దం విన్పించగానే ఆలోచనల్లోంచి ఈలోకంలోకి వచ్చాడు వినయ్. జనాన్ని తప్పించుకుంటూ రిజర్వేషన్ కంపార్ట్‌మెంట్ వైపు నడిచాడు. రెండు నిమిషాలు గడిచాయి.

'నీరజ కన్పించదేం? తను రాకున్నా వస్తున్నట్లు తనను మళ్ళీ ఫూల్‌ను చేస్తుందా?'- వినయ్ మనసు తిరిగి అనుమానాల పరంపరలోకి దారిపోతుండగా "హాయ్! బావా" అంటూ వెనకనుండి ఓ గొంతు విన్పించింది. వెంటనే వెనక్కి తిరిగి చూసాడు వినయ్. ఎదురుగా నీరజ. అంతే ఒక్కక్షణం అతనికి నోట మాటరాలేదు. ఐదేళ్ళ క్రితం నాటి గర్వం, దర్పం ఆమె ముఖంలో ఛాయకైనా కన్పించడం లేదు. చెదరని చిరునవ్వు, ముఖంపై అస్పష్టమైన మడతలు, పెళ్ళి కాని గుర్తులు...



**వినయ్ మాటలు విని నీరజ స్వచ్ఛంగా నవ్వింది. ఒకరినొకరు అర్థం చేసుకునే మనసులు ఒక్కటవ్వడం నిజంగా అదృష్టమంది. మీ పెళ్ళి విషయం తనకు ముందే తెలిస్తే .....**

"నీరజా!...."

అప్రయత్నంగా అతని పెదవులు పలికాయి. ఇద్దరూ పరస్పరం క్షేమసమాచారాల గురించి పలకరించుకున్న తర్వాత ఆటోలో ఇంటికి బయలుదేరారు. నీరజ గలగలా మాట్లాడేస్తుండగా, గతం గుర్తుకొస్తున్న వినయ్ మాత్రం కేవలం శ్రోతగానే మిగిలిపోయాడు. మాటల సందర్భంలో తనకు నెలక్రితం రిజిష్టర్ మ్యారేజీ జరిగిందని మాత్రం అనుమానం రాకుండా చెప్పగలిగాడు. ఆటో ఎక్కిన దగ్గర్నుంచి వినయ్‌ని ఒకేఒక ప్రశ్న వేధిస్తోంది. 'నీరజ ఇంకా పెళ్లెందుకు చేసుకోలేదు?'. అయితే ఆ ప్రశ్న నీరజను అడగాలనిపించలేదు వినయ్‌కి.

దగ్గరగా వేసి వున్న ఇంటి తలుపులు నెడుతూ నీరజతో పాటు లోపలికి ప్రవేశించాడు వినయ్. సునీతను పిలిచి "షి ఈజ్ మై లైఫ్ పార్టనర్" అంటూ డాంబికంగా నీరజకు పరిచయం చేసాడు. నీరజ ముఖంపై చిరునవ్వు మెరిసింది.

"కంగ్రాట్స్ బావా! బ్యూటిఫుల్ సెలక్షన్" అంటూ సంతోషంగా వినయ్‌ని గ్రీట్ చేసింది.

నీరజ ముఖంలో రంగులు మారతాయనుకున్న వినయ్‌కి నీరజ స్పందన ఆశనిపాతమైంది. 'సునీత తమ ఆఫీసులోనే పనిచేస్తుందని, అక్కడే తామిద్దరి మధ్య పరిచయం ఏర్పడి అది ప్రేమకు దారితీసిందని, ఇష్టాలు, అభిప్రాయాలు, ఆలోచనలు కలవడంతో మనస్ఫూర్తిగా ఇద్దరం ఒక్కటయ్యామని, ఇందుకు సునీత అమ్మానాన్నలు కూడా సమ్మతించారని, ఇప్పుడు తమ జీవితం పూలపల్లకీపై సాగిపోతోందని'- నీరజ అడక్కపోయినా కట్టుకథను పకడ్బందీగా చెప్పాడు వినయ్. వినయ్ మాటలు విని నీరజ స్వచ్ఛంగా నవ్వింది. ఒకరినొకరు అర్థంచేసుకునే మనసులు ఒక్కటవ్వడం నిజంగా అదృష్టమంది. మీ పెళ్ళి విషయం తనకు ముందే తెలిస్తే తను మంచి ప్రెజెంటేషన్ పట్టుకొచ్చేదాన్నని అంటూ "అవును బావా! మీ పెళ్ళి ఫోటోలు చూపించనే లేదు"- ఏదో జ్ఞాపకం వచ్చినట్టు సడెన్‌గా అడిగింది నీరజ. ఊహించని ఆ ప్రశ్నకు షాక్‌తిన్నట్టు నిశ్చేష్టుడయ్యాడు వినయ్. వెంటనే తేరుకొని తత్తరపడుతూ "ఫో...టో...లు... ల్యాబ్‌లో వున్నాయి. తెద్దామనుకుంటుంటే తీరికే దొరకడంలేదు. నీకోసం వాటిని ఇంటికి పంపిస్తాగా" అతి కష్టంమీద అనగలిగాడు వినయ్.

తన తత్తరపాటును నీరజ అంతగా గమనించకపోవడంతో బతికిపోయాననుకున్నాడు వినయ్. నీరజ తనను చూసి ఈర్ష్య చెందాలని, (తరువాయి 29వ పేజీలో)

(14వ పేజీ తరువాయి)

అసూయపడాలని, కుళ్ళికుళ్ళి ఏడ్వాలని తలచిన వినయ్, సునీతతో అతి సన్నిహితంగా మెలిగినా నీరజ అతిమామూలుగా తీసుకుంటోంది. ఇది వినయ్‌కి మింగుడుపడటం లేదు. నాల్గురోజులు అతి జాగ్రత్తగా నెట్టుకొచ్చాడు. తన వ్యవహారం బయటపడకుండా సహకరిస్తున్నందుకు సునీతకు మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. నీరజ రాక ఫలితంగా తెలీకుండానే సునీతతో వినయ్‌కి ఒకరకమైన అనుబంధం ఏర్పడింది.

*** ***



తనిక వెళతానని నీరజ అనగానే కనీసం మాట మర్యాదకైనా ఉండమని అనలేదు వినయ్. ఆటోలో ఇద్దరూ కలసి రైల్వేస్టేషన్‌కు బయలుదేరారు. నీరజ వచ్చినప్పుడు ఎలా మాట్లాడిందో, ఇప్పుడూ అలా గలగలా మాట్లాడుతూనే వుంది. నీరజను 'ఫీలయ్యేలా' చేయడంతో తను ఫేలయినందుకు వినయ్‌కి తీవ్ర అసంతృప్తిగా వుంది. ప్లాట్‌ఫామ్‌పై ట్రెయిన్ సిద్ధంగా వుండడంతో రిజర్వేషన్ కంపార్టుమెంట్‌లో తన బెర్త్‌పై లగేజ్‌ను వుంచి బయటకు వచ్చింది నీరజ. వస్తూనే వినయ్ కళ్ళలోకి సూటిగా చూసింది. వినయ్ మాత్రం ఆమె కళ్ళలోకి చూడలేకపోతున్నాడు.

"బావా!"- ఇద్దరి మధ్యా ఉన్న మౌనాన్ని చీలుస్తూ అంది నీరజ.

ఏమిటన్నట్లు చూసాడు వినయ్.

"బావా! వచ్చినప్పటి నుండీ చూస్తున్నాను. నువ్వు నాతో ఫ్రీగా మాట్లాడడం లేదు. నేను పలకరిస్తేనే సమాధానమిస్తున్నావ్. నువ్వు గతాన్ని మరచిపోలేదా? నాపై నీకు కోపం చల్లారిపోలేదా?..." ఇంకేదో అనబోతుండగా ట్రెయిన్ కదలిన శబ్దం. గభగభా కంపార్టుమెంట్‌లోకి ప్రవేశించి అన్నది-

"బావా! మీ పెళ్ళికి ఇది నా కానుక" అంటూ తన హ్యాండ్ బ్యాగ్‌లోంచి ఓ కవర్‌ను తీసి వినయ్ చేతికందించింది. ఎందుకో సరిగ్గా అదే సమయంలో నీరజ కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. ట్రెయిన్ వేగమందుకొంది. వినయ్ నిశ్చేష్టుడై చూస్తున్నాడు. చేయి ఊపుతూ వీడ్కోలు తీసుకుంటున్న నీరజ నెమ్మదిగా కనుమరుగైపోయింది.

ఇంటికొచ్చిన వినయ్ ఆతృతగా నీరజ ఇచ్చిన కవర్ ఓపెన్ చేసాడు. ఊటీకి రిజర్వు చేసిన రెండు ట్రెయిన్ టిక్కెట్లతో పాటు మరో కాగితం కన్పించింది. విప్పి చూసాడు, మళ్ళీ అవే అక్షరాలు.

*'బావా!*

*నేనెంత దురదృష్టవంతురాల్ని? ఐదేళ్ల క్రితం నీ ప్రేమను తిరస్కరించి, నిన్ను అవమానించి నీవు అక్కడ్నుంచి వెళ్ళిపోయేందుకు కారణమై మాకు దూరం చేసుకున్నాను. కాని కాలం నా కళ్ళు తెరిపించింది. నన్ను ప్రేమిస్తున్నాడని నేను నమ్మిన వ్యక్తి నన్ను కాక నా ఆస్తిని ప్రేమిస్తున్నాడని తెలియడంతో అతనితో తెగదెంపులు చేసుకున్నాను. స్వార్థపరుడి ప్రేమను నమ్మి నిష్కల్మశమైన నీ ప్రేమను గుర్తించలేకపోయాను. ఆ తర్వాత నేనెంత మానసిక వ్యధ చెందానో మాటల్లో చెప్పలేను. నన్ను ఇష్టపడి, నన్ను కోరుకున్న నీవు మరొకరితో జీవితం పంచుకోలేక ఇంకా ఒంటరిగా వుండి వుంటావన్న అత్యాశతో వచ్చి భంగపడ్డాను. బావా! నేను నిన్ను మిస్సయ్యాను. నీ ప్రేమను, నీ అనురాగాన్ని మిస్సయ్యాను. ఇది నాకు తగిన శిక్షే. సునీతతో నీ జీవితం కలకాలం సుఖంగా సాగాలని మనసారా కోరుకుంటున్నాను. మీ హనీమూన్ ఊటీలో జరిగేందుకు రెండు టిక్కెట్లు రిజర్వు చేసాను. నా ఈ చిరుకానుకను సహృదయతతో స్వీకరిస్తారని ఆశిస్తున్నాను.*

*ఇట్లు*
*- నీరజ*

ఉత్తరం చదవడం పూర్తవ్వగానే శిలలా మారిపోయాడు వినయ్.

'నీరజా!...' అంతరంగాల్నుంచి ఉబికివచ్చిన ఆత్మీయతతో అతని పెదవులు పలికాయి. ఉత్తరం చదవమని సునీతకిచ్చాడు. నీరజపై తను విజయం సాధించాడా? లేక నీరజను తను కోల్పోయాడా? ఆలోచనలు అతనికి ఊపిరాడనివ్వటం లేదు.

"ఏమిటాలోచిస్తున్నారు?" నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ అంది సునీత.

వినయ్‌నుంచి సమాధానం లేదు.

"వినయ్ గారు! తన తప్పును తెలుసుకొని మిమ్మల్ని కోరి వచ్చిన నీరజను మీరు మళ్ళీ మిస్ కాకూడదు. ఇప్పుడు నీరజ కడిగిన ముత్యం. ఆమె మిమ్మల్ని మనస్ఫూర్తిగా ప్రేమిస్తోంది. వెంటనే వైజాగ్ బయలుదేరండి. ఆమె మెళ్ళో మూడుముళ్ళు వేసి ఆమెని, ఆమె తండ్రిని మామూలు మనుషుల్ని చేయండి" సునీత మాటలకు వినయ్ మళ్ళీ మౌనం వహించాడు. "వినయ్‌గారు కాంట్రాక్టు ప్రకారం నేను వచ్చిన పని పూర్తయింది. నీరజతో మీ జీవితం మీ వ్యక్తిగతం. నేనెక్కువగా కల్పించుకోవడం కూడా భావ్యం కాదు"

అప్పుడు పలికాయి వినయ్ పెదవులు.

"సునీతా! నవ్వూ వెళ్ళిపోతావా? కేవలం ఈ ఐదురోజుల్లోనే మనిద్దరి మధ్య ఎంత అనుబంధం పెనవేసుకుపోయిందో నువ్వు గమనించలేదా? లేదు సునీతా నీవు నన్నిడిచి వెళ్ళొద్దు" వినయ్ మాటలు విని సునీత విస్మయం చెందింది.

"వినయ్‌గారు నా గురించి మీకు తెలిసివుండి కూడా..." సునీత మాటలు పూర్తికాకముందే వినయ్ అడ్డుతగిలాడు.

"అంతా తెలుసు సునీతా! నీరజ మనస్సు ఇప్పుడు గాయపడ్డా తండ్రి నీడన కాలం గడుస్తున్న కొద్దీ ఆమె తిరిగి మామూలు మనిషవుతుంది. కాని నువ్వు చేసిన పాపమేమిటి సునీతా? అనాధవైనందుకు ఈ వృత్తిలో నీవిలా జీవితాంతం గాయపడుతూ బతకాల్సిందేనా? లేదు సునీతా! ఈ ఐదు రోజులూ మనం పెళ్ళయినట్టు నటించాం. మనం దాన్నిప్పుడు నిజం చేద్దాం. ఆవేశంతోనో, మోహంతోనో చెబుతున్న మాటలు కావివి. సునీతా! మనస్ఫూర్తిగా నేను నిన్ను కోరుకుంటున్నాను"

సునీతకు జరుగుతున్నదంతా నమ్మబుద్ధి కావడం లేదు. కళ్ళలోంచి జలజలా కన్నీళ్ళు వర్షిస్తుండగా వినయ్‌ని అప్రతిభురాలై చూస్తోంది.

వినయ్ సునీతను సమీపించాడు. మనసు పొరల్లోంచి ఉబికివస్తున్న ప్రేమతో ఆమెను దగ్గరికి తీసుకొని నొసటిపై చుంబించాడు. గుండెలోతుల్లోంచి పొంగిపొరలుతుండగా వెక్కివెక్కి ఏడుస్తూ సునీత వినయ్‌ను హత్తుకొని అతని బాహువుల్లో కరిగిపోయింది.

*సినీభేతాళం...* *15వ పేజీ తరువాయి*

వ్యవహరించవలసిన సమయం ఇది. తోటి ఆర్టిస్టును చేసుకుంటే చాలా ప్రమాదాలు వున్నాయి. అవి సెకండ్ హాండ్ కేసులుఅయి వుంటాయి. అందులో శాశ్వత లక్షణాలు తక్కువ. అందుకే బయట ప్రపంచానికి వెళ్లాలి. అంతమాత్రాన ఏ బట్టలకొట్టు బసవయ్యనో, కాఫీ హోటల్ కాంతారావునో చేసుకుంటే లైఫ్ స్టయిల్ పడిపోతుంది. తన హోదాకు తగిన మనిషికోసం ఆమె ఎదురు చూస్తున్న సమయంలో భగవంతుడు వరప్రసాదంగా ఎన్నికలు తీసుకువచ్చాడు. ఈ ఎన్నికల సమయంలో మంచి వరుణ్ణి సంపాదించుకోవాలని ప్రేమాంజలి నిశ్చయించు కుంది. అందువల్లనే ఎన్నికల ప్రకటన రాగానే జండా పుచ్చుకుని పోలోమని పరుగెత్తి పోకుండా తగిన మనిషికోసం గాలం వేసింది. అన్ని విధాలా యోగ్యుడు, అనుకూలుడు, హోదా, డబ్బు, స్టేటసు వున్న వరంగల్లు రాజావారు తగిలారు. అందువల్లనే ప్రేమాంజలి ప్రతి అడ్డమైన వాడి నియోజకవర్గానికి వెళ్లలేదు. కేవలం వరంగల్లుకే పరిమితం అయింది. రాజా వారిని ఆశ్రయించింది. సాధించింది. కొంగున ముడేసుకుంది. కథ అందరికీ నచ్చిన శుభం సీనుతో ముగిసింది." అంటూ విక్రమార్కుడు ప్రేమాంజలి జరిపిన ఎన్నికల ప్రేమాయణానికి వివరం చెప్పాడు.

అటు ప్రేమాంజలి, రాజావారికి ఫస్ట్ నైట్ సందడిలో వున్నారు. ఆ రోజు ఘనమైన విందు, రాచరికపు విందు. షడ్రసోపేతమైన విందు. అర్ధరాత్రి, శవం, కటికచీకటి ఎప్పుడూ వుండేవిగా- ఇవాళ్టి అవన్నీ మరిచిపోయి విక్రమార్కుడు భేతాళుడు బాగా ముస్తాబయి, అందంగా అలంకారం చేసుకుని సెంటు, అత్తరు గుభాళింపుతో వరంగల్లు పెళ్లి భోజనాలకు బయలుదేరారు.